శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కొండబిట్రగుంటలో కొయల్ ఆల్వాల్ తిరుమంజనం

**బిట్రగుంట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 2 నుండి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా కొయల్ అల్వాల్ తిరుమంజనం కార్యక్రమాన్ని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థాన గర్భగుడిలో ఆలయ శుద్ధి చేసి సుగంధ పరిణామాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఏడాది పొడవునా గర్భగుడిలో హారతి కర్పూరం, దీపారాదన వంటి వాటితో మసి బారకుండా వుండేందుకు ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు టిటిడి వైఖానస సంప్రదాయం ప్రకారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, ఇవో అరవ రాధాకృష్ణలు తెలిపారు.

**పానక వినియోగానికి 60 కేజీల బెయ్యం వితరణ...**

ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భక్తులకు పానక వినియోగం కొరకు పాతబిట్రగుంట మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయరాలు విజిత 60 కిలోల బెల్లాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రాధాకృష్ణకు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు అందరు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు తనను ఆశీర్వదించాలి - పేర్నాటి

**ఆత్మకూరు, ఫిబ్రవరి28ప్రభాతవార్త:** రానున్న శాసనమండలి ఎన్నికల్లో తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసే తనను గ్రాడ్యుయేట్లందరూ ఆశీర్వదించి దీవించాలని అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆత్మకూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశం మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను ఎన్నికలో బరిలో ఉన్నానన్నారు. మూడు జిల్లాల పరిధిలో 36నియోజకవర్గాలున్నాయన్నారు. 3లక్షల83వేల మందికి పైగా గ్రాడ్యుయేట్లుగా ఉన్నారన్నారు. మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రులంతా తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అత్యంత మెజార్టీ వచ్చేలా వైసిపి కుటుంబ సభ్యులు తనకు సహకరించాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు , అభిమానులు ప్రతి ఒక్కరి కృషి తోనే 3లక్షలా 86వేలమంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో తనకు అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు .ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పిస్తూ అందరికి అండగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలే తనకు అత్యంత మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తుందని శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన స్థానంలో సోదరుడు విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ గౌతంరెడ్డి లేని లోటును తీరుస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి తాను కృషి చేస్తానని, పట్టభద్రులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఓటింగ్ విధానాన్ని వివరించారు. అనంతరం మండలాల వారీగా ఓటర్ లిస్టులను నాయకులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సంగసాని గురుమోహన్, ఆత్మకూరు మున్సిపల్ చైర్మెన్ గోపవరపు వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్‌లు డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, సర్ధార్, ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు అంబటి కృష్ణారెడ్డి, ఊరిమిండి ప్రభాకర్‌రెడ్డి, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని జడ్పీటిసి సభ్యులు , ఎంపిపిలు, వైసిపి మండల కన్వీనర్లు , జెజిఎస్ మండల అధ్యక్షులు , వైసిపి ప్రజా ప్రతినిధులు , నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాహనాల ద్వారా ఇంటి వద్దే బియ్యం పంపిణీ

**నెల్లూరు అర్బన్, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** రాష్ట్రప్రభుత్వం అందజేసిన చౌకదుకాణాల వాహనాల ద్వారా ఇంటి వద్దనే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తా మని పౌరసరఫరాల అధికారి తెలిపారు. జిల్లాలో 7,22,263 బియ్యం కార్డుదారులకు 1513చౌక దుకాణాల్లో 438 మొబైల్ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 8గంటల వరకు ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరపనున్నారు. పిహెచ్ఎస్ కార్డు దారులకు ఒక్కొక్కరికి 5కేజీల బియ్యం, కేజీ కందిపప్పు 67రూ, అరకిలో పంచదార 17రూ చొప్పున అందిస్తామన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు అడిగే హక్కు జగన్‌కి లేదు

**నెల్లూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** శాసనమండలినే రద్దు చేస్తానని ప్రకటించిన జగన్‌కి ఎమ్మెల్సీ ఓటు అడిగే హక్కు ఉందాని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్ అజీజ్ ప్రశ్నించారు. మంగళవారం రూరల్ పరిధిలోని 29వ డివిజన్‌లో వెంకట్‌రెడ్డి నగర్‌లో దొడ్డపనేని.రాజానాయుడు ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారానికి ముఖ్యఅతిధిగా అబ్దుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు రాయలసీమ పరిధిలో నిరుద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించాలంటే టీడీపీ అభ్యర్థి కంచర్ల.శ్రీకాంత్‌ను శాసనమండలికి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మేకల.నరేంద్రరెడ్డి, కనపర్తి.గంగాధర్, చెంచయ్య, అస్లాం, కదీర్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఖైదీలు మంచిగా మెలగాలి




**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** క్షణికావేశానికి లోనై సబ్‌జైలులో వున్న ఖైదీలు సమాజంలో చెడు ప్రభావాలను విడిచిపెట్టి మంచిగా మెలగాలని కావలి మండల లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి యం.శోభ తెలిపారు. కావలి సబ్‌జైలులో మంగళవారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి శోభ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సమాజంలో అందరితో మమేకమయ్యేలా ప్రవర్తన వుండాలన్నారు. ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ సభ్యులు న్యాయవాది ఐ.సాయిప్రసాద్, న్యాయవాది నరసింహారావు, జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి



**నెల్లూరు టౌన్, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** ప్రతి ఒక్కరిలోనూ సృజనా త్మకత, నైపుణ్యం దాగి ఉంటాయని వాటిని వెలికి తీసేందుకు కృషి ఎంతో అవసరమనినెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని పిల్లలపార్కు సమీ పంలో నైపుణ్య అభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్యఅతిధిగా హాజరైన శ్రీరామరాజు చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు మాట్లాడుతూ అందరిలోనూ తెలివి తేటలు ఉంటాయని ఐతే వాటిని సాన పెట్టాల్సిన అవశ్యకత ఉందన్నారు. అసిస్టెంట్ మోటార్ వాహనాల ఎస్సై పూర్ణచంద్రరావు, శశిధర్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీమోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కాకతీయ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

**కావలి రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెవివి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కావలి రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది. కాకతీయ పాఠశాల విద్యార్థులు షేక్ మస్తాన్, ప్రేమ్‌తేజ, విక్టర్ పాల్, యర్‌నస్టన్, ఉమర్‌లు నీటిలో అలారం ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈ విద్యార్థులు మాట్లాడుతూ నీటిలో అలారం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పెద్దపెద్ద వాటర్ టాంక్‌లు కానీ ఇళ్లలో వుండే వాటర్ టాంక్‌లు కానీ నిండినట్లు తెలియకపోవడంతో నీరు వృధా అవుతుందన్నారు. ఆ విధంగా నీరు వృధాగా పోకుండా వుండాలంటే నీటిలో అలారం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తమ పాఠశాల కరస్పాండెంట్ జాకబ్, ప్రధానోపాధ్యాయిని ఫైవ్‌రోజ్, సైన్స్ ఉపాధ్యాయులు మాలకొండయ్య, హిందీ ఉపాధ్యాయులు సుబ్రమణ్యం ప్రోత్సాహంతో నీటిలో అలారంను తయారు చేసి ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించిన జెవివి బాధ్యులు విద్యార్థులను అభినందించారు

## పడవ ప్రమాద కుటుంబాలకు 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

**పొదలకూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** తోడేరు గ్రామంలోని రత్నగిరి చెరువులో పడవబోల్తాఘటనలో మృతి చెందిన 6 గురు యువకుల కుటుంబసభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు రాష్ట్ర వ్యవసాయా శాఖామంత్రి కాకాణిగోవర్ధన్‌రెడ్డి కార్యాలయం నుండి అధికార ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలోని సారాంశం మేరకు మంత్రి కాకాణి స్వగ్రామం తోడేరులో పడవ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల గురించి రాష్ట్ర మంత్రి కాకాణి జరిగిన తీరు వివరించడంతో తక్షణమే ముఖ్యమంత్రి జగన్ స్పందించి ప్రతి కుటుంబానికి 5 లక్షలు ప్రకటించి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానని మంత్రి కాకాణి పేర్కొన్నారు.

# దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న శాస్త్రవేత్తలు

**నెల్లూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** ఎంతోమంది భారతీయ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలతో, ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నారని కలెక్టర్ కేవిఎన్.చక్రధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని దర్గామిట్టలో ఉన్న జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో హౌస్ సర్జన్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత పరిశోధనలపై దృష్టి సారించి దేశాన్ని ప్రపంచ దేశాల్లోనే, భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలపాలన్నారు. నాలుగున్నరేళ్లుగా వైద్య విద్యను అభ్యసించి నేడు ప్రాక్టికల్‌గా వైద్య విద్యను నేర్చుకునేందుకు హౌస్ సర్జన్ షిప్‌లోకి అడుగుపెడుతున్న వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. హౌస్ సర్జన్ విద్యార్థులకు కొన్ని పరిమితులు ఉంటాయని, వాటికి లోబడి సీనియర్ వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ



ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. గత నాలుగు ఏళ్ళ కాలంలో థీరీ క్లాసుల ద్వారా నేర్చుకున్న విషయాలను, నేడు ప్రాక్టికల్‌గా నేర్చుకుంటున్న విషయాలను సమన్వయం చేసుకుంటూ వైద్యం అందించడంలో ప్రతి విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పేదలకు వైద్యం అందించడంలో ముందంజలో ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. పేదలకు వైద్యం అందిస్తే వారు వైద్యులు దేవుళ్ళ సమానంగా వైద్యులను ఆదరిస్తారన్నారు. గత రెండేళ్ళ కాలంలో కోవిడ్ సందర్భంగా జీజీహెచ్‌లో కోవిడ్ రోగులకు మెరుగైన వైద్యం అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో వైద్యులు ఎంతగానో కృషి చేశారన్నారు. సైన్స్‌ను పెంపొందించేలా ప్రతి పాఠశాల, కళాశాలల నందు ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ప్రమాణాలను ప్రభుత్వరంగంలో మెరుగుపరిచేందుకు, ఆయుష్మాన్ భారత్, నాడు-నేడు వంటి వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఖాళీగా ఉన్న వైద్య, సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు, అవసరమైన మౌళిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శిద్దానాయక్, ఎపిఎంఎస్ఐడిసి ఈఈ విజయభాస్కర్, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కోఆర్డినేటర్ కాకుటూరు.సునంద, వివిధ విభాగాల హెచ్ఓడిలు, హౌస్ సర్జన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రీసర్వేను తనిఖీ చేసిన జెసి

**చేజర్ల ,ఫిబ్రవరి28ప్రభాతవార్త:** మండలంలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ మంగళవారం పరిశీలించారు. కోటితీర్థం, మడపల్లి, గొల్లపల్లిలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేకు రైతులు సహకరించాలని సూచించారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పొలాలకు ఉన్న వివాదాలు, హద్దు సమస్యలు , ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైన వాటిని సరిచేయడం తదితర కార్యక్రమాలను రీసర్వేతో పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం చేజర్ల, మడపల్లి



సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో జరుగుతున్న సంక్షేమ పథకాలు ఎలా అమలవుతునా న్నయన్న విషయమై సిబ్బందితో మాట్లాడారు.

రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకోసమే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు.

ఈయనవెంట తహసిల్దార్ బొమ్మిశెట్టి శివకృష్ణయ్య, డిప్యూటీ తహసిల్దార్ పొట్టాబత్తిన విజయ్, రీసర్వే డిటి మొలత్రాటి గిరీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నియంతతో పొత్తా...?

**నెల్లూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** ఆర్థిక నేరస్థుడు, అరాచకవాది, రాష్ట్రంలో నియంతపాలనను కొనసాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డితో ఏ పార్టీ కూడా పొత్తు పెట్టుకోదని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం అల్లీపురంలోని ఆయన నివాసం నుంచి విలేఖరులతో జూమ్ యాప్‌లో జగన్ చంద్రబాబునాయుడుని ఉద్దేశించి చంద్రబాబుకి దమ్ముంటే పొత్తు లేకుండా రమ్మన్నాడని దానికి



బదులుగా సోమిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే మీ సమస్యలన్నింటినీ తీర్చుతానని అధికారంలోకి వచ్చాడని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. సమస్యలను పరిష్కరించక పోయినా పరవాలేదు, అయితే ప్రజలను ఆయన, వారి నాయకులు దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలను సృష్టిస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇది జగన్ మెరిగిన సత్యమన్నారు. 175 సీట్లలో పోటీ చేసే దమ్ము చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లకు ఉందాని జగన్ అడగడం హాస్యాస్పదంగా ఉందని సోమిరెడ్డి అన్నారు. అదే 175 సీట్లలో ఒక్క దాంట్లో అయినా మీతో కలిసి వచ్చే పార్టీ ఈ దేశంలో ఉందని చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారం చేతిలోకి రావడంతోనే ప్రజలను మోసం చేసిన వ్యక్తివి నువ్వని మండిపడ్డారు. ప్రజల కోసమే పనిచేసే టీడీపీ ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకుంటుందన్నారు. 1983 నుంచి పలు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశామన్నారు. మరికొన్ని ఎన్నికల్లో కలిసొచ్చిన పార్టీలతో పొత్తు పెట్టుకున్నామన్నారు. నీలాగా తండ్రి మరణాన్ని అడ్డుపెట్టుకుని సీఎం కాలేదని ధ్వజమెత్తారు. ఎన్డీఏ, యూపీఏ, నేషనల్ ఫ్రంట్ లాంటి అనేక కూటములు ఈ దేశాన్ని పాలించాయన్నారు. కొన్నింటిలో మేము కూడా భాగస్వాములమయ్యామన్నారు. ప్రజలతో అధికారం పంచుకోవడం కోసం పొత్తుల రూపంలో కొన్ని పార్టీలు కలిసి వస్తాయన్నారు. నువ్వు నియంత కాబట్టి నీతో ఎవరూ కలిసి వచ్చే ప్రసక్తేలేదని ఆయన వివరించారు. నాలుగు పార్టీలు కలిసి అధికారాన్ని పంచుకోవడాన్ని హేళనగా మాట్లాడడం మీ నియంతృత్వ పాలనకు నిదర్శనమని దుయ్యబట్టారు.

## అరుణాచలం గిరిప్రదక్షణకు ప్రత్యేక ఆర్టీసి బస్సులు



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కావలి ప్రాంత ప్రజల చిరకాల కోరిక మేరకు ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరిప్రదక్షణకు వెళ్లే భక్తులు, యాత్రికుల సౌకర్యం కోసం కావలి ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని ఆర్టీసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మాట్లాడారు. మొదటి సారిగా మార్చి 6వ తేది అరుణాచలం గిరిప్రదక్షణకు బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు కావలిలో ఉదయం 8 గంటలకు బయలుదేరి రాత్రి అరుణాచలం చేరుతుందని తెలిపారు. గిరిప్రదక్షణ అనంతరం తిరిగి కావలికి వస్తుందన్నారు. సీటు రిజర్వేషన్ సౌకర్యం కూడా వుందన్నారు. కావలి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోలేరమ్మ.. దండలమ్మా



**కలువాయి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మండలకేంద్రమైన కలువాయిలోని బజారు వీధిలో ఉండే శ్రీపోలేరమ్మ అమ్మవారి సన్నిదానం నందు టైలర్స్ యూనియన్ ఆద్వర్యంలో ప్రతే్యకపూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే కార్యక్రమంలో భాగంగాఅమ్మవారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత కలువాయమ్మ తల్లి పసుపు, కుంకుమ సారి సమర్పించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దరి్శంచుకొని పోలేరమ్మ తల్లి కాపాడమ్మ అంటు శరణు కోరారు. కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి సొసైటీ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి, పెసల వేణుగోపాల్, ఉయ్యాల సుబ్బారావు, కొమ్మురూ మస్తాన్‌బాబు , ,టైలర్ ్స యూనియన్‌నాయకులు పాల్గోన్నారు.

# జగనన్న గోరుముద్ద పథకం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టిన .జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని దానిని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గంగా భవాని అన్నారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఆమె మధ్యాహ్న భోజన పతకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ జిల్లాలోని ఏ పాఠశాలలో లేని విధంగా మెనూలో లేని పచ్చడి, వడియాలు కూడా విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి స్ఫూర్తిని ఏజెన్సీలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో జగనన్న



గోరుముద్దపై అడిగి తెలుసుకున్నారు.

**సమిష్టి కృషి విజయానికి సోపానం** ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఒక టీమ్‌గా ఉండి సమిష్టి కృషితో పనిచేయడం వలన అనేక విజయాలు సులువుగా వస్తున్నాయని, ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు తెలియజేశారు. టీమ్ లీడర్ బాగుంటేనే ఆ టీమ్ అంతా ముందుకు సాగుతుందని కొనియాడారు. ఈ పాఠశాలలో రికార్డుల నిర్వహన, తదితర విషయాల్లో ముందంజలో ఉండడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. అదేవిధంగా ఈ పాఠశాలలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం శుభపరిణామం అన్నారు. అంతకుముందు పాఠశాలలోని సైన్స్ ప్రయోగశాలలను పరిశీలించి చక్కగా నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అంతకుముందు ఈ సైన్స్ శిబిరాన్ని ఎంపీడీవో శ్రీహరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు నరసింహామూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గుడ్లూరు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** :గుడ్లూరు మండలంలో పలుచోట్ల విద్యుత్ కేంద్రాల్లో మరమ్మత్తులు నిర్వహించడం కోసం సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ తెలిపారు. తెట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని 33కెవి సబ్‌స్టేషన్ పనులు చేస్తున్నట్లు అధికారులుపేర్కొన్నారు. ఇందుకోసం ఉలవపాడు, గుడ్లూరు మండలంలోని ఏలూరుపాడు, చేవూరు, రావూరు, మోచర్ల, పాజర్ల, వీరేపల్లి, చాగొల్లు తదితర ప్రాంతాల్లో కరెంట్ ఆపుతున్నట్లు పేర్కొన్నారు.

## మార్చి 2న మండల సర్వసభ్య సమావేశం

**కలిగిరి, పిబ్రవరి28, ప్రభాతవార్త;** కలిగిరి మండల సర్వసబ్య సమావేశం మార్చి 2 గురవారం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కళాదర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం11గంటలకు జరిగే ఈ సమావేశానికి కలిగిరి మండలంలోని అందరు సర్పంచిలు, యంపిటిసి సభ్యులు, మండలాద్యక్షులు, జడ్పీటీసిసభ్యులు అన్నిశాఖల అదికారులు, ప్రజాప్రతినిదులు హారుకావాలని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు టిడిపి పార్టీ ఆర్థిక సహాయం



**కందుకూరు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:** గత డిశంబర్ 28వ తేదీన జరిగిన తొక్కిసలాటలో 8మంది టిడిపి కార్యకర్తలు చనిపోగా పార్టీ తరుపున, పలువురు పార్టీ నేతలు ప్రకటించిన 22.5లక్షల ఆర్థిక సహాయాన్ని ఇదివరకే బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగింది. ఇందులో భాగంగా మంగళవారం టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో మరికొంతఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన బాష్యం ప్రవీణ్ ప్రకటించిన లక్ష రూపాయలు, విజయనగరం బొబ్బిలి టిడిపి ఇన్‌చార్జి రంగారావు(బేబినాయన) ప్రకటించిన 50వేల విలువైన చెక్కులను నాగేశ్వరరావు అందజేశారు. భవిష్యత్తులో ఏ ఖష్టం వచ్చినా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, మోషే, రఫీ, నాదెళ్ల సుబ్బారావు తదితరులు హాజరైయ్యారు.

# పలు పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ నిర్వహణ

**కందుకూరు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** నేషనల్ సైన్స్‌డే సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతరత్న, నోబెల్అవార్డు గ్రహీత సివి రామన్ అడుగుజాడల్లో నడుస్తామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ పూనారు. టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక జంతుశాస్త్ర విభాగం ఫోటో ఎక్జిబీషన్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్‌రవికుమార్‌తో పాటు పి. రాజగోపాల్, కమలబాబు, డాక్టర్ అనూష, కృష్ణశర్మ, అధ్యాపకులు హాజరైయ్యారు. అలాగేకోటారెడ్డినగర్‌లోని చైతన్య కళాశాలలో నేషనల్ సైన్స్‌డేని ప్రారంభించారు. ప్రత్యేకంగా వైమానిక నమూనాలనువీక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, ఆర్ఐ అనీల్‌కుమార్, కోఆర్డినేటర్ జి. శ్రీనివాసులు, డిఎన్ జి. బ్రహ్మయ్య తదితరులు హాజరైయ్యారు. పామూరు రోడ్డులోని బిఆర్ ఆక్స్‌ఫర్ ఒలంపియాడ్ స్కూల్లో చైర్మన్ ఉన్నం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వర్లు, బాలభాస్కర్, నరేంద్రబాబు, మల్లికార్జున, రామారావు తదితరులు హాజరైయ్యారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించండి

**ఉలవపాడు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** :ఈ నెలలో జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఉలవపాడు మండలంలో ప్రచారం చేపట్టారు. మంగళవారం ఉలవపాడు, పెద్దపట్టపుపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పట్టభద్రులు కలిసి ఓట్లును అభ్యర్ధించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ తూర్పు రాయలసీమ స్థానంలో పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు, దాడులతో పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. జగన్ చేతకాని పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలోరాచగల్లు సుబ్బారావు, ఎ. వాసు, ఆవుల రఘు, సుదర్శి శ్రీను, బెల్లం కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యురాలు దార్ల యలమందమ్మ, తొట్టెంపూడి మాల్యాద్రి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడివో

**ఉలవపాడు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:**ఉలవపాడు మండలం చాగొల్లు సచివాలయాన్ని ఎంపిడివో ఎల్. చెంచమ్మ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. ఉద్యోగులు సచివాలయంలో సమయపాలన పాటించాలని కోరారు.

## భావి భారత శాస్త్రవేత్తలను తయారు చేయడంలో జెవివి పాత్ర అభినందనీయం




**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** భావి భారత శాస్త్రవేత్తలను తయారు చేయడంలో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి తప్పక నెరవేరుతుందని, సైన్స్ పట్ల పెద్దపీట వేయడం ఎంతైనా అభినందనీయమని కావలి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కామంచి సుబ్బారావు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కామంచి మాట్లాడారు. సైన్స్‌కు పెద్దపీట వేస్తూ విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసే పోటీలు నిర్వహించడం ఎంతైనా ప్రశంసనీయమన్నారు. జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏట వివిధ విజ్ఞాన కార్యక్రమాలు, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణ, మూఢ నమ్మకాల నివారణ, శాస్త్రీయ దృక్పథం పెంపొందించే విధంగా పాటుపడుతుందన్నారు. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు కూడా తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఈ నెల 13వ తేది నుండి 28వ తేది వరకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, బాధ్యులు సి. కల్లయ్య, జి. కళ్యాణి, చాకలకొండ శారద, కోటేశ్వరరావు, జాన్, షేక్ రఫి, జానకిరాం, ఖాదర్‌బాషా, గాదిరెడ్డి హరనాథ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ రేవంత్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ వెంకటేశ్వర్లు, పి. భారతి, గణపతిరాజు, మారుతిరావు, యం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# సొంత స్థలందారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**వింజమూరు, ఫిబ్రవరి28ప్రభాతవార్త:** వింజమూరు సచివాలయం-1 పరిధిలో ఉన్న సొంత స్థలందారులు తాము ఇంటిని నిర్మించుకునే ఆసక్తి కలిగిన వారు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిఇ సి. హెచ్. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం కలిగి ఉండి ఇంటిని నిర్మించుకోవాలనే ఆసక్తి గల వారు ఆయా సచివాలయాల పరిధిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకొని గృహనిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఇ మలినేని మహేష్, వర్క్ఇన్స్‌పెక్టర్ కె. సందీప్‌కుమార్‌రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె. వెంకటనారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎపిఎన్‌జిఒ తాలూకా విభాగం కార్యవర్గం ఎంపిక



**వింజమూరు ,ఫిబ్రవరి28ప్రభాతవార్త:** వింజమూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ మహిళా విభాగ కార్యవర్గ ఎంపికను మంగళవారం చేసినట్లు అధ్యక్షుడు వెలుగోటి మధు తెలిపారు .వింజమూరులోని పాత గవర్నమెంట్ హాస్పటల్లో తాలూకా మహిళా విభాగం కార్యవర్గానికి ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా జిల్లా వైస్‌ప్రెసిడెంట్ వై. కరుణమ్మ, జిల్లా చైర్‌పర్సన్ యు. చిన్నమ్మ, సిటీ జాయింట్ సెక్రటరీ షేక్ షంషుద్దీన్ వ్యవహరించారు. వింజమూరు మహిళా సంఘం చైర్‌పర్సన్‌గా ఎం. జయలక్ష్మి, కో-పర్సన్‌గా ఎం. సుజాత, కన్వీనర్‌గాసి. హెచ్. సుభాషిణి, కోకన్వీనర్‌గా కె. అరుణ, ట్రెజరర్‌గా జి. రాధ, వైస్‌చైర్మెన్‌లుగా కె. సుజాత, యు. కోమలాదేవి, వి. రాజేశ్వరి, జాయింట్ కోకన్వీనర్‌గా ఎం. సుజాత, కె. శిరీషలు ఎన్నికయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ట్రెజరర్ షఫి, సిబ్బంది సి. హెచ్. చిన్నయ్య, సి. హెచ్. గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, ఫిబ్రవరి28ప్రభాతవార్త:** వింజమూరులోని పలు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు . స్థానిక నేతాజీ వికాస్, ఇన్‌ఫాంట్ జీసెస్, శ్రీసరస్వతీ , వివేకానంద, నారాయణ పాఠశాలల్లో జరిపిన కార్యక్రమాల్లో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. వివిధరకాల ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థులు వాటి గురించి వివరించారు. ప్రతి ప్రయోగం యొక్క భావం, దాని ఉపయోగం గురించి తెలిపారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యం రత్నం, ఐజాక్, అంకిరెడ్డి, మద్దూరు గోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ సైన్స్‌దినోత్సవం సందర్భంగా సైన్స్ ప్రయోగాలను చేయడం విద్యార్థుల్లోని విజ్ఞాన తృష్ణను పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి దశనుంచే విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించుకొని కొత్త విషయాలను తెలుసుకుంటూ నూతన సాంకేతికత వైపు పయనించాలన్నారు .ఎంతో పేరుపొందిన సర్ సి. వి. రామన్ లాంటి శాస్త్రవేత్తలను, వారి అనుభవాలను గుర్తుంచుకొని వారి మార్గంలో పయనిస్తూ నూతన అంశాలను తెలుసుకుంటూ ముందుకు సాగితే విద్యార్థుల భవిష్యత్తు ఉత్తమమార్గంలో ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యావంతుడైన శ్రీకాంత్‌ని గెలిపించాలి

**వలేటివారిపాలెం పిబ్రవరి 28, ప్రభాతవార్త:**మార్చిలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలలో తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కందుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఓటర్లుకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఉప్పలపాడు, రోళ్లపాడు, కొండసముద్రం కూనిపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడైన శ్రీకాంత్‌ను గెలిపిస్తే శాసనమండలిలో ఆయన పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం, కొండసముద్రం గ్రామఅధ్యక్షుడు గట్టమనేని సుబ్బారావు, మండల తెలుగురైతు అధ్యక్షుడు తాటికొండ రమణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకుమాని హర్ష, తెలుగు యువత అధ్యక్షుడు బద్దిపూడి శిఖామణి, స్థానిక నేతలు సంపతి శ్రీనివాసులు, సోమినేని శ్రీనివాసులు, నలమోతు రాంబాబు, మన్నం చిరంజీవి, మన్నం నరేష్, దార్ల సంజీవ్, మాలకొండయ్య ఘట్టమనేని లక్ష్మినరసింహం, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడ పట్ల అప్రమత్తం -ఎంపీడీవో

**వలేటివారిపాలెం పిబ్రవరి 28, ప్రభాతవార్త:** రానున్న వేసవిలో ఎదురయ్యే తాగునీటి ఎద్దడి పట్ల అప్రమత్తంగా ఉండాలని వలేటివారిపాలెం ఎంపీడీవో రఫీక్ అహ్మద్ ప్రజలకు సూచించారు. ఇందుకోసం తాగునీటి వనరులపై అవగాహనతో మెలగాలన్నారు. బోర్లు, బావులుతోపాటు తాగునీటి పథకాలలో భూగర్భజలసామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం రావొచ్చని అన్నారు. బోర్లు వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బోర్లు మరమ్మత్తులకు గురైతే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. బోర్‌మెకానిక్ పోలిచెర్ల



బ్రహ్మయ్య ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుండి-చెర్లోపాలెం, రోళ్లపాడు-రాళ్లపాడు స్కీంలుతోపాటు ఆయా గ్రామాలలో అమలయ్యే తాగునీటి పథకాలపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రఫీక్ అహ్మద్ తెలిపారు.

## ఆర్థిక పరిస్థితితో కుటుంబం బాగుంటుంది



**నెల్లూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం:** కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగుంటూనే కుటుంబం బాగుంటుందని తద్వారా సమాజాభివృద్ధి సాధ్యమౌతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి దాసరి. రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ ఇస్తున్న పావని, వసుంధరలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి. సురేష్‌కుమార్‌జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు, ఐఆర్‌సిఎస్-ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. ఉచితంగా ఎవరైనా కుట్టు శిక్షణ నేర్చుకోవాలంటే రెడ్‌క్రాస్ కార్యాలయంలో కాని, 9647108108, 9390885240 ఫోను నంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

## విజేత విద్యార్థుల సైన్స్‌పేర్ అబ్బుర పరిచింది

**పొదలకూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పట్టణంలోని విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌పేర్ అబ్బుర పరచే విధంగా ఉందని పొదలకూరు వైస్‌ఎంపిపి సోమా అరుణ అన్నారు. విజేత స్కూల్ వారు నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రారంభం సి. వి రామన్ చిత్రపటానికి అందరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంవిజేత కరస్పాండెంట్ కామాక్షి సోమా అరుణాని



శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు నేడు ప్రపంచం గర్వించ దగ్గ శాస్త్రవేత్త సర్ సి. వి రామన్, రామన్ ఎఫ్క్టెను ఆవిష్కరించన రోజు అని అన్నారు. ఈ సందర్భంగా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. విజేత స్కూల్‌లో పిల్లలు తయారు చేసిన పలు సైన్స్ నమూనాలు పరిశీలించి సోమా అరుణా ఆశ్చర్యపోయారు. చిన్నపిల్లలు ఇంతసాంకేతికంగా ఆలోచిస్తున్నారంటే దాని వెనుక స్కూల్ ఉపాధ్యాయులు ప్రోత్సహం ఉందన్నారు. పిల్లలను బుల్లి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దిన అధ్యాపకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక పరికరాలు ఏలా పనిచేస్తాయో డెమో ద్వారా చూపించారు. ఈకార్యక్రమంలో జడ్‌పి బాలుర హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎ. వి సుధాకర్. విజేత స్కూల్ హెడ్‌మిస్ టి. స్వప్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.

## ఊటుకూరులో పొలంబడి శిక్షణా కార్యక్రమం



**సైదాపురం, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:**మండలంపరిధిలోని ఊటుకూరు గ్రామ సమీపంలో ఉన్న వరి పొలంలో మండల వ్యవసాయశాఖ అధికారిని హైమావతి రైతులకు పొలంబడి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి, కాలిబాటలు, శత్రు, మిత్ర పురుగుల వంటి వివరాలు, వాటి వలన కలిగే లాభనష్టాలు రైతులకువివరించారు. అలాగే పంటసాగు యాజమాన్యం అధిక దిగుబడులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, శ్రీకర్, మస్తాన్, శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

## గిద్దలూరు అంగన్వాడి సెక్టార్ సమావేశం



**సైదాపురం, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:** మండల పరిధలోని గిద్దలూరు గ్రామంలో రూపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సెక్టార్‌సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న జీరో నుండి 6సంవత్సరాల లోపు పిల్లల బరువు, ఎత్తును ప్రతిరోజూ కచ్చితంగా గుర్తించా లని తెలిపారు. అదేవిధంగా బరువు తక్కువ ఉన్న పిల్లలను, అనీమియా గర్భవతులను, బాలింతలను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఫాతిమా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**సైదాపురం, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:** మండలపరిధలోని మరలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా 120మంది సైన్స్ ఎగ్జిబీషన్ నిర్వహించారు. గ్యాస్ లీక్ అలర్ట్, వాటర్ సేవింగ్ అలర్ట్, రోడ్డుభద్రతా, కాలుష్యం, పర్యావరణ పరిశుభ్రత, పౌష్టికాహారం, స్వచ్ఛ విద్యాలయం తదితర అంశాలను ఎగ్జిబీషన్‌లో ప్రదర్శించడం జరిగింది. సైన్స్ సంబంధించిన బొమ్మలను ప్రదర్శించారు. వ్యాస రచన, డ్రాయింగ్ వంటి పోటీలునిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు చలపతిరావు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింద ని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీదేవి, శివకృష్ణ, స్కూల్ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**సైదావురం, ఫిబ్రవరి28, ప్రభాతవార్త:** వాహనాదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాపూరు సిఐబి. కోటేశ్వరరావు హెచ్చరించారు. మండలకేంద్రమైన సైదాపురంలోని షామైన్ ప్రాంతంలో పలు వాహనాలనుమంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి చలానా విధించారు. అనంతరం సిఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని వాహనదారులు సరైన




పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని లేని పక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా రోడ్డు మార్గంలో నిబంధనలు అతిక్రమించి పరిమితికి మించి లారీల్లో లోడ్లు తరలించడం, ఓవర్‌స్పీడ్, ట్రాఫిక్‌రూల్స్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సైదాపురం ఎస్సై పి. నాగబాబు, సిబ్బంది ఉన్నారు.

## అమరావతి స్కూల్‌లో చిన్నారి శాస్త్రవేత్తల వైజ్ఞానిక ప్రదర్శన



**పొదలకూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పట్టణంలోని అమరావతి పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సి. వి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన స్వతహాగా ప్రతి స్పందించే రోబో 3.0 ,హైడ్రాలిక్ సిస్టమ్‌తో పనిచేసే జెసిబి, డయాలసిస్ సిస్టమ్, రక్తప్రసన వ్యవస్థ, నీరు నిలువచేసే విధానం ,జియో స్టేషనరీ శ్యాటిలైట్ వంటి అద్భుతమైన 370 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో పాల్గోన్న విద్యార్థులను పలువురు ప్రశంసించారు. అమరావతి కరస్పాండెంట్ కె సురేష్ మాట్లాడుతు విద్యార్థులలో సృజనాత్మకత శక్తి వెలికి తీయ్యడానికి ఈ ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గోన్నారు. తాటిపర్తి స్కూల్‌లో పొదలకూరు మండలంలోని తాటిపర్తి ఎంపిపిఎస్ (ఎస్‌సి) పాఠశాల యందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన తాటిపర్తి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ నాగమోహన్‌రెడ్డి ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన అన్ని ప్రయోగాలను విద్యార్థుల నుండి అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈకారక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమీటి జి రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసులు, సహా ఉపాధ్యాయని పి. అరుణ ,సిఆర్‌పి ఏడుకొండలు సహా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## రూ.16 లక్షలు తీసుకొని తప్పుడు డాక్యుమెంట్లు ఇచ్చి మోసం చేశారని ఫిర్యాదు

**కావలి రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** 16 లక్షల రూపాయలు తీసుకొని 2.30 ఎకరాలకు సంబంధించి తప్పుడు డాక్యుమెంట్లు ఇచ్చి మోసం చేశారని కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ రామానుజాపురం గ్రామానికి చెందిన వాయిల రమణయ్య కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు రామానుజాపురం గ్రామానికి చెందిన వాయిల రమణయ్య పొలం కొనేందుకు కొండారెడ్డిని సంప్రదించాడు. ఆయన కావలి పాతవూరుకు చెందిన బిజెపి మహిళా మోర్చ కావలి పట్టణ అధ్యక్షురాలు కామినేని ఉదయలక్ష్మిని రమణయ్యకు పరిచయం చేశాడు. కామినేని ఉదయలక్ష్మి, కొండారెడ్డిలు కలిసి కావలి రూరల్ మండలం రుద్రకోట వద్ద జాతీయ రహదారి 16 పక్కన తక్కువ ధరలో పొలంవుందని మాయమాటలు చెప్పి 12 లక్షల రూపాయలు తీసుకున్నారు. సర్వే నెం.515/1-1 నెంబరులో 2.30 ఎకరాల పొలంకు సంబంధించి వాయిల రమణయ్య పేరు మీద తప్పుడు డాక్యుమెంట్లను ఇచ్చారు. పొలంకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే వీఆర్వో మాల్యాద్రికి ఇవ్వాలని మరో 2 లక్షల రూపాయలు ఉదయలక్ష్మి, కొండారెడ్డిలు తీసుకుని వాయిల రమణయ్యను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. కావలి రూరల్ ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భాష్యం పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం

**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని భాష్యం పాఠశాలలో సి.వి.రామన్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు అల్లం శ్రీనివాసులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 300కు పైగా విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు విద్యా ర్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లం శ్రీనివాసులు మాట్లాడుతూ రేపటి భావి భారత భవిష్యత్ నేటి విద్యార్థుల చేతుల్లో వుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధి రోహించాలని కోరారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రావీణ్యాన్ని ప్రో త్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను, తల్లి దండ్రులను అభినందించారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్‌సింగ్, సామాన్య శాస్త్ర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేజర్ల నివాళులు



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాత వార్త :** కోవూరులోని ఎంఎంజే మటన్ స్టాల్ అధినేత మొగల్ మొహతాబ్ అలీ గుండెపోటుతో హఠాత్తుగా మృతిచెందాడు. ఈ మేరకు చిన్న పడుగుపాడులోని వారి నివాసంలో మంగళవారం పార్థివదేహానికి తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్ర ధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా వారి కుటుంబసభ్యు ల ను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. టీడీపీ నాయకులు నాసిర్ మొహమ్మద్, విజయ్, వెంకటేశ్వర్లు, గోపాల్, వెంకటేష్‌లు ఉన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**కావలి రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కావలి తహశీల్దార్ కోలగట్ల మాధవరెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కావలి పట్టణం శాంతినగర్‌లోని నారాయణ పాఠశాల రెండో బ్రాంచ్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వర్కింగ్, నాన్ వర్కింగ్ మోడల్స్ గల స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహశీల్దార్ మాధవరెడ్డి విద్యార్థుల ప్రదర్శలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ చాలా చక్కగా వున్నాయన్నారు. నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రావడం చాలా సంతోషంగా వుందన్నారు. ఎజియం రవివ ర్మ, ఆర్ఐ చందు, ప్రిన్సిపాల్ సుమంత్, ఎవో బడే సాహెబ్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిరుద్యోగి ఓటుతో ఈ ప్రభుత్వం గాలిలో కలిసిపోవాలి



**నెల్లూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** నిరుద్యోగులకు ఉద్యోగులు ఇస్తానని జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చి వారిని మోసం చేశాడని, రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ ఏకమై రానున్న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మీరు వేసే ఓటుతో వైసీపీ ప్రభుత్వం గాల్లో కలిసిపోవాలని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ధర్మవరం.సుబ్బారావు అన్నారు. మంగళవారం నగరంలోని 47వ డివిజనులో ధర్మవరం.సుబ్బారావు ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి.శ్యాంప్రసాద్‌రెడ్డి పోటీ చేస్తున్నాడని, నకిలీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఆయనను పట్టభద్రుల అభ్యర్థిగా గెలిపిస్తే పట్టభద్రులు అనే మాటకే అర్థం ఉండదన్నారు. ఇలాంటి నిందితులకి కూడా ఓటు వేసి గెలిపిస్తే రౌడీరాజ్యానికి ఆహ్వానం పలికినట్లేనన్నారు. నిరుద్యోగులను మోసం చేసి జగన్‌కి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులంటే ఏమిటో రుచి చూపియాలన్నారు. నెల్లూరు జిల్లాలోని తోడేరు బోటు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకి ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారి కుటుంబాలని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కేసి.భాస్కర్, అద్దంకి.చంద్రశేఖర్, షేక్.బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ సైన్స్ దినోత్సవం



**అనంతసాగరం, ఫిబ్రవరి28ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని వికాస్ హైస్కూల్లో నేషనల్ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి ఎం.బాలకృష్ణారెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి హాజరయ్యారు. వికాస్‌హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని అతిథులు పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి ఎం.బాలకృష్ణారెడ్డి , ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఎఎస్ఐ మస్తాన్‌బాషాను వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఖాజావలి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు

## ముగిసిన సొసైటీ సభ్యత్వాల రెన్యూవల్ ప్రక్రియ

**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** ది నెల్లూరు జర్నలిస్టు పరస్పర సహాయక సహకార గృహనిర్మాణ సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యతనమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. గత గురువారం నుండి నెల్లూరులోని ఆ సంఘ కార్యాలయంప్రెస్‌క్లబ్‌లో రెన్యూవల్ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, స్థానికదినపత్రికల్లో సభ్యత్వాన్ని రెన్యూవల్ చేస్తున్న నోటీసులను విస్తృతంగా ప్రచారం చేశారు. ఫిబ్రవరి23 నుండి మంగళవారం ఉదయం 1గంట వరకూ సభ్యుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. సభ్యుల వద్ద నుండి సమస్త సొసైటీ డైరెక్టర్లు ధరఖాస్తులు స్వీకరించారు. త్వరలో ఎన్నికలు జరిగే ప్రకియ చేపడుతున్నట్లు అధ్యక్షులు వేల్పుల శేషాచలపతి, కోకన్వినర్ వల్లూరు ప్రసాద్‌కుమార్ తెలియజేశారు.

## వియాని హోమ్స్ సేవలు స్ఫూర్తిదాయకం



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కరోనా సమయంలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వియాని చేసి సేవలు స్ఫూర్తిదాయమని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం 70 మంది అనాథలు , వికలాంగులకు పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి శారీరక , మానసిక వికలాంగులను తమ అక్కున చేర్చుకుని వారికి కావాల్సిన ఇటువంటి పౌష్టికాహారం అందజేస్తున్న వియాని హోమ్స్ నిర్వాహకుల చొరవ అభినందనీయమన్నారు. ప్రదానోపాధ్యాయుడు నరసింహమూర్తి మాట్లాడుతూ సమాజా భివృద్ధిలో చదువే కీలకమని, ప్రతి ఒక్కరూ చదువుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. వియాని హోమ్స్ సిస్టర్ రమా తమ సంస్థ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, ఏపీఎం వెంకటస్వామి, సురేఖ, తదితరులు ఉన్నారు.

## రియాక్ జేయస్ టెక్నాలజీ అధ్యయనం అవసరం



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక రంగంలో వచ్చే వివిధ టెక్నాలజీలో రియాక్ జేయస్ టెక్నాలజీని అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులకు రియాక్ జేయస్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్‌సైట్లలో ఇంటరాక్టివ్ ఎలిమెంట్‌లను రూపొందించడానికి, వెబ్ అభివృద్ధిలో ఉపయోగించే జావా స్ట్రిప్ లైబ్రరీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి వి. గాయత్రి పలు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్‌గా వి. రంతుల్లా , సమన్వయకర్తలుగా షేక్. ఆసిఫ్, బి. పూజితలు వ్యవహరించారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** పొదుపు మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా స్వయం ఉపాది రంగాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా వారు ముందుకు సాగాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం 90 పొదుపు గ్రూపులకు సెర్ప్ ద్వారా వచ్చిన పెరటికోళ్లను వాటికి సంబంధించిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే తరహాలోనే నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి సమాజంలో వస్తున్న నూతన పోకడలకు అనుగుణంగా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఆదిశగా ముందుకు సాగా లన్నారు. అనంతరం కోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, ఏపీఎం వెంకటస్వామి, సీసీలు రాజశేఖర్, శ్రీనివాసులు, వీవోఏలు ఉన్నారు.

## సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగకరం



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** సైన్స్ అనేది మానవ జీవితంలో పూర్తిగా మిళితమై ఉందని అది ఎంతో ఉపయోగకరమని రిటైర్డ్ అధ్యాపకులు పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ప్రయోగాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. సర్ సీవీ రామన్ చూపించే బాటలో విద్యార్థులు పయనించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఈ పాఠశాలను దత్తత తీసుకుని ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు భిక్షాలు, మండల విద్యాశాఖ అధికారి రహీమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తిలు పలు సూచనలు చేశారు. అనంతరం సైన్స్ పోటీల్లో ప్రథమ , ద్వితీయ , తృతీయ బహుమతులు సాధించిన వి ద్యార్థులకు వి. సోని ప్రథమ బహుమతి కింద 5,116లు, ఎన్. పవిత్ర ద్వితీయ బహుమతి 3116, డి. గోవర్ధిని తృతీయ బహుమతి 2,116లు, నాల్గవ బహుమతి బి. మాధవి 1,116లను ప్రశంసా పత్రాలతో పాటు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పీఆర్‌కేఆర్ గ్రూపు సభ్యులు సాయియశ్వంత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జగదీష్‌స్వామి, తదితరులు ఉన్నారు.

## యువత ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు



**సంగం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** సంగం ఆనకట్ట వద్ద, కావలి కాలువ వద్ద యువత ఈతకు వెళ్లకుండా సంగం సి.ఐ రవినాయక్ , ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పొదలకూరు రత్నగిరి చెరువులో జరిగిన దుర్ఘటనను దృష్టిలో వుంచుకొని, అలాగే రానున్నది వేసవి కాలం అయినందున ఈ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఈతకు వెళ్ల నివ్వకుండా చూడాలని అన్నారు.

## సోమేశ్వరాలయంలో మృత్యుంజయ పూజలు



**అనంతసాగరం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని సోమే శ్వరాలయంలో మంగళవారం స్థానిక డాక్టర్ సి.ఎస్.మూర్తి ఆపరేషన్ విజయవంతం కావాలని మృత్యుం జయ పూజలు గ్రామనాయకులు నిర్వహించారు. 30సంవత్సరాలకు పైగా పేద ప్రజలకు సేవలు అందించిన డాక్టర్ సి.ఎస్.మూర్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని , మంగళవారం ఆపరేషన్ జరుగుతుందని ఆపరేషన్ విజయవంతంగా జరిగి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి గ్రామంలో వైద్యసేవలు కొనసాగించాలని దేవుడిని ప్రార్థించామని గ్రామస్తులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైకాపా నాయకులు , గుండుబోయిన ఈశ్వరయ్య, గుండుబోయిన వెంకటరమణ, గుండుబోయిన కృష్ణయ్య, ముక్కుమస్తాన్‌గౌడ్, ముక్కు సుబ్బరాయుడు, దంతటి గంగయ్య, మత్స్య సంఘం నాయకులు ఎస్.వెంకటరమణ, వల్లం ప్రసాద్, కార్యకర్తలు గుండుబోయిన అర్జున్, కరీం తదితరులు పాల్గొన్నారు.

## విశ్వభారతీ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని విశ్వభారతీ ఇంగ్లీషుమీడియం స్కూల్‌లో నేషనల్ సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈసైన్స్ ఎగ్జిబిషన్ లో విద్యార్దులు అద్భుతమైన ప్రయోగాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కరస్పాండెంట్ ఎస్.కె.మస్తాన్‌సాహెబ్, ప్రధానోపాధ్యాయురాలు హనీఫాతో కలిసి ఆయన విద్యార్దులు చేసిన ప్రయోగాలు తిలకించారు. మొట్టమొదట సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుచిన్నతనం నుండి విద్యార్దులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రయోగాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు హనీఫా మాట్లాడుతు విద్యార్దులందరు 50 ప్రయోగాలు చేశారని అందులో కొన్ని ప్రయోగాలు ఎంపిక చేసి విద్యార్దులకు బహుమతులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. సైన్స్ విద్యార్దులు విద్యార్దులకు సైన్స్ యొక్క గొప్పతనం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## ప్యానుకు రెండు రెక్కలు విరిగాయి కంభం విజయరాయిరెడ్డి



**కలిగిరి, పిబ్రవరి 28, ప్రభాతవార్త;** నెలూర్లుజిల్లా వైసిపి పార్టీలో పానుకు రెండు రెక్కలు విరిగాయని మూడవరెక్కకూడా త్వరలో విరిగిపోనుందని ఉదయగిరి మాజీ శాసన సభ్యులు కంభం విజయరామిరెడ్డి సంచలన వ్యాక్యలు చేశారు. మంగళవారం కలిగిరి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో యంఎల్‌సి ఎన్నికల సన్నాహసభ కార్యక్రమం జరిగింది. టిడిపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జీ బొల్లినేని వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో తెలుగుదేశంపార్టీ యంయల్‌సి అబ్యర్ది కంచర్ల శ్రీకాంత్ పరిచయవేదిక జరిగింది. ఈకార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గంలోని అయామండలాలనాయకులు, బూత్‌కన్వీనర్లు, మండలనాయకులు పాల్గొన్నారు. ఈసందర్బంగా జరిగిన సమావేశంలో అధ్యక్షతవహిచిన బొల్లినేని మాట్లాడుతూ గత యంఎల్‌సి ఎన్నికల్లో స్వల్పతేడాతో ఓడడం జరిగిందని ఈసారి ప్రతిఒక్కరూ వైసిపిని ఓడించాలనే పట్టుదలతో ఉన్నారన్నారు. ఏమి ఘనకార్యంచేశారని ఉధ్యాయులు ఓటువేస్తారన్నారు. పిఆర్‌సి పేరుతో ఊరించడమే కాకుండా వారికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. డియస్సీ వేసిందేలేక నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ పరిస్తితుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడే ప్రతిఓటు తెలుగు దేశం పార్టీ అనుకూలంగా మలచుకోవాలన్నారు. అవకాశాన్ని ప్రతి నాయకుడు ఉపయోగించుకొని శ్రీకాంత్ ను గెలిపించుందామన్నారు. యంఎల్‌సి అబ్యర్ది కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే చాలావరకు ఉపాధ్యా సంఘాలను కలవడమైందన్నారు. ఎక్కడికెళ్లినా తెలుగుదేశంపార్టీపై విధ్యావంతులు ,మేదావులూ అబిమానంగా ఉన్నారన్నారు. మార్చి13న జరిగే ఈఎన్నికల్లో గెలిసి టిడిపి సత్తాఏమిటో వైసిపికి చూపబోతున్నామన్నారు. అనంతరం మాజీశాసన సభ్యులు కంభం విజయరాయిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి యంఎల్‌సి ఎన్నికలు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ప్యాను పార్టీఇబ్బందులుపడుతుందన్నారు. ఇప్పటికే ప్యానుకు రెండు రెక్కలు విరిగిపోగా మరోరెక్కకూడా త్వరలో ఇరగనుందన్నారు. జిల్లాలో లక్షా పదివేల యంఎల్‌సి ఓట్లు ఉన్నాయన్నారు. వీటిలో అత్యదికం టిడిపికి పడేవిదంగా ప్రతినాయకుడూ కృషి చేయాలని పిలునిచ్చారు. ఈకార్యక్రమంలో పార్టీ పరిశీలకులు స్టేట్ ఆర్గనైజర్ సెక్రేటర్‌విజయమ్మ, కంచర్ల జనార్ధన్, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, ఒంటేరు జైచంద్రారెడ్డి, కాకి ప్రసాద్, బొల్లినేని వెంకట రామారావు, బిజ్జం వెంకట క్రిష్ణారెడ్డి, కల్లూరి చంద్రమౌళితదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు బానిసై ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు




**కొండాపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి తెలిపారు. మంగళవారం కొండాపురం ఆదర్శ పాఠశాల గోడలపై చెడు వ్యసనాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై పెయింట్లు వేయించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసెకోవద్దన్నారు. ఈ అలవాటు వల్ల ఎటువంటి నిర్ణయాలు తీసుకొని ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. ముఖ్యంగా వేసవిలో వివిధ ప్రాంతాల నుండి గ్రామాలకు వచ్చే విద్యార్థులు గ్రామాలలో వుండే చెరువులు, వంకలు వద్దకు సరదాకి వెళ్లి ప్రాణాలు మీద తెచ్చుకోవద్దన్నారు. ఇటీవల జరిగిన నెల్లూరు జిల్లాలో ఘటన చాలా బాధాకరమన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివించి ప్రయోజకులు అయ్యే సమయంలో ఇలాంటి సంఘటనలు జరిగితే ఆ కుటుంబం ఎంతో విషాదానికి గురవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి-పర్యావరణాన్ని కాపాడండి



బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్తబుచ్చిరెడ్డిపాళెం రెయిన్‌బో స్కూల్‌లో అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నగరపాలక ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతుందని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె కోరారు. మొక్కలు నాటం వల్ల ఆక్సిజన్, సకాలంలో వర్షాలు పడడం జరుగుతుందని చెప్పారు. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమని ఆమె చెప్పారు. ఈకార్యక్రమంలో కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ మెర్ల జయంతి, పాఠవాల కరస్పాండెంట్ చిట్టిబాబు, దళితనాయకులు భీమతాటి రమణయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటా: బొల్లినేని



**కలిగిరి, ఫిబ్రవరి28, ప్రభాతవార్త;** కూరగాయలు పండించేపైతులకు సరైన మార్కెట్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే రైతు సమస్యలు తీరుతాయని ఉదయగిరి మాజీశాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. రైతులకు ఎప్పుడూ అండగా ఉండేది ఒక్క తెలుగుదేశంపార్టీ నేనన్నారు. మంగళవారం బొల్లినేని ఉదయగిరికి వెళ్తూ మార్గమధ్యంలో నాగిరెడ్డిపాళెం సెంటరు వద్ద ఆగారు. అక్కడ కొందరు రైతులు తాము పండించిన కూరగాయలను మార్కెట్‌కు తరలించేందుకు వేసి ఉండగా గమనించిన రామారావు అక్కడ కొంతసేపుఆగి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాతంలో ఆదాయ వనరులు లేక రైతులు పలు ఇబందులు పడుతున్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు దరలు లేవన్నారు ఇప్పుడు కొందరు రైతులు కూరగాయలు పండించినా అమ్ముకునేందుకు అందుబాటులో మార్కెట్ సదుపాయంలేదన్నారు. జిల్లాకేంద్రమైన నెల్లూరు, విజయవాడ, కావలి లాంటి ప్రాంతాలకు వెళ్లి తాము పండించిన కూరగాయలు అమ్ముకోవలసివస్తుందన్నారు. ఇంతంత దూరం వెళ్లి అమ్ముకోవడంతో కర్చులు అధికమై చేతికి లాభాలురావడంలేదని తెలిపారు.

## కన్నులపండుగగా స్పటిక శివలింగం ఊరేగింపు



**కందుకూరు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త** పట్టణంలోని పెద్దబజారులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో స్పటిక లింగాన్ని ప్రతిష్టిం చారు. ఇందులో భాగంగా తల్లాయిపాలెం శైవ పిఠాదిపతి శివస్వామి చేతులమీదుగా ప్రతిష్ఠించే స్పటిక శివలింగాన్ని ఊరేగింపు నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుండి వాసవీనగర్‌మీదుగా కందుకూరు ప్రధానవీధుల ద్వారా రధం ఊరేగింపు కన్నుల పండుగగా చేపట్టడం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రధాన్ని ఊరేగింపుగా మేళతాళాలు, కోలాటాలతో ఆలయ కమిటీ నిర్వహించారు. సుమారు 20మంది ఆర్యవైశ్య మహిళలు ఏక రూపు దుస్తులతో కోలాట ప్రదర్శన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు.

## మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గొల్లపల్లి



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కావడానికి సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రరపదేశ్ రాష్ట్ర విద్యుత్ సైన్స్ అండ్ టెక్నాలజీ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి విజయకుమార్ బొకే, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయకుమారన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమానికి పాటు పడతానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎం. శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

## చదువుతో పాటు క్రీడలు కూడా ప్రధానం



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి సూనకల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ పోటీల్లో తొలిసారిగా పాల్గొన్న నెల్లూరు జిల్లా విద్యార్థినులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని అండర్-19 , అండర్ -17 విభాగాల్లో 12 పథకాలను సాధించి జిల్లా పేరును మరింత ఇనుమడింప జేశారని జిల్లా విద్యాశాఖ అధికారి గంగా భవాని పేర్కొన్నారు.
కోవూరులోని బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఆమె పథకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ పథ కాలు సాధించిన 12 మందిలో 8 మంది విద్యార్థులు ఈ పాఠశాల విద్యార్థులే కావడం అభినందనీయం అన్నారు. ఇటువంటి ఘన విజయం సాధించేందుకు తోడ్పడిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక, ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తిలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రహీమ్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## వైభవంగా త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు



**కోవూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కోవూరులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సద్గురు త్యాగరాజు స్వామి తృతీయ ఆరాధన మహోత్సవాలను నాయి బ్రాహ్మణ వాయిద్య కళాకారుల కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా నాయి బ్రాహ్మణ వాయిధ్య కళాకారుల కమిటీతో పాటు కె. మానస, రమేషన కటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం త్యారాజు స్వామివారి చిత్రపటంతో కోవూరు పురవీధుల్లో పల్లకి సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం యచేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా భీమవరం కృష్ణయ్య, వారి కుటుంబ సభ్యులు వ్యహరించారు. నంతరం భారీ స్థాయిలో శాక్సోఫోన్ సంగీత వివావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి ఆస్థాన విద్వాంసులు జేవీ సురేష్, పి. వేణుగోపాల్, తిరుమల తిరుపతి నిలయ విద్వాంసులు పి. దశరథ్, కంచి కామకోటి పీఠ ఆస్థాన డోలు విద్వాంసులు డీవీ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజు స్వామివారి వాయిధ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బైజు ట్యూషన్ సెంటర్‌లో నేషనల్ సైన్స్‌డే వేడుకలు

**నెల్లూరు, ఫిబ్రవరి28 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక బైజు ట్యూషన్ సెంటర్‌లో జాతీయసైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్ సెంటర్ హెడ్ బుసా శశికుమార్ మాట్లాడుతు సైన్స్ శతాబ్దాలుగా మానవాళిని ఆకర్షించే, అవతసరమైన సాధనమన్నారు. సైన్స్ అభివృద్ధి చెందుతుండంటే మానవుని జీవనశైలి అభివృద్ధి చెందటమేనని పేర్కొన్నారు. నూతన ఆలోచనలనుండి, నూతన ఆవిష్కరణలను సృష్టించినప్పుడే భవిష్యత్ సుఖవంతంగా, సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు సైన్స్ కెరీర్ చాలా ముఖ్యమైందన్నారు
. జ్ఞానం, విజ్ఞానం, విమర్శనాత్మక ఆలోచన, డేటా విశ్లేషణ, సమస్యల పరిష్కారం వంటి వాటిని విద్యార్థులు అలవరుచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలతో సమా జంలో పనులు సులభతరం చేయవచ్చన్నారు. విద్యార్థులు చిన్నతనంనుండే సైన్స్‌పై అవగాహన కలిగి ఉం డాలని, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారి వారి పిల్లలను సైన్స్‌పై మక్కువ పెంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. నూతన ఆవిష్కరణలో ఆరోగ్య సంరక్షణ కూడా సధ్యమౌతుందన్నారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడవచ్చన్నారు. కంప్యూటర్ సైన్స్, మెడికల్ సైన్స్, గణిత విద్య, వంటి వాటిలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ముందుగా మనవాలిని మేల్కోల్పేది సైన్స్ మాత్రమేనన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శలను అందరిని అలరించాయి.

## పట్టభద్రుల యంఎల్‌సీ అభ్యర్థిగా సన్నారెడ్డి దయాకర్ రెడ్డిని గెలిపించండి

**కండలేరుడ్యాం(రాపూరు), ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థిగా బారతీయ జనతా పార్టీ బలపరిచిన తిరుపతి జిల్లాఆధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వెంకటగిరి నియోజకవర్గం బిజేపి ఇన్‌చార్జ్ యస్, యస్, ఆర్ నాయుడు కోరారు. మంగళవారం ఆయన యంఎల్‌సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని కండలేరు డ్యాంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడైన దయాకర్ రెడ్డిని గెలిపించి రాష్ట్రంలో బారతీయ జనతా పార్టీబలపడేందుకు కృషి చేయాలని కోరారు. ఈయన వెంట మండల పార్టీ ఆధ్యక్షుడు దూడల పెంచలయ్య, పలువరు బిజేపి నాయకులు కార్యకర్తలు వున్నారు.

## ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



**నెల్లూరు, ఫిబ్రవరి28 ప్రభాతవార్త-విద్య** నెల్లూరుజిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్థానిక కాపువీధిలో అసోసియేషన్ పతాకన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కళ్యాణమండపంలో భారీ సబను నిర్వహించారు. ఈ కార క్రమంలో ముఖ్యఅతిధిగా మాజీ మంత్రి పోలు బోయిన అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని టైలర్స్ సంక్షేమాన్ని కాంక్షిస్తూ తమ అధి నేత, రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కార్పోరేషన్‌ను స్థాపించటం జరిగిందన్నారు. ప్రతిఏటా రాష్ట్రంలోని అర్హత కలిగిన టైలర్స్ అందరికి ఇచ్చిన మాట ప్రకారం నగదును నేరుగా వారి అకౌంట్స్‌కి జమ చేయటం జరుగుతుందన్నారు. అన్నీ వర్గాల, అన్నీ కులాల వారిని సమానంగా చూసిన ఘనత తమ పార్టీకు దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ తిరిగి అదికాంలోకి రావటం తధ్యమన్నారు. జిల్లాలో టైలర్స్ సంక్షేమం కోసం పాటుపటతామని హామీ ఇచ్చారు. గతంలో ఇండ్లస్థలాల పంపిణీ అంశంపై ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థలాలను ఇవ్వలేకల పో య్యామని, కేవలం 30రోజుల్లోపలే అర్హులైన టైలర్స్‌కు నివాస స్థలాలలను అందించనున్నామని ప్రకటిం చారు. అనంతరం కార్పోరేటర్ మహేష్ మాట్లాడుతు అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరగటం సంతోసంగా ఉందన్నారు. అందరూ కలిసి ఉంటే సమస్యల సాధన మరింత సులభతరం అవు తుందన్నారు. టైలర్స్ సంక్షేమానికి రూ.100 కోట్లు తమ ముఖ్యమంత్రి ప్రకటించటం సంతోష దాయకమ న్నారు. అనంతరం మాజీ మంత్రి అనిల్‌ను పుష్పగుచ్చాలు అందిచి ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార క్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లెనిన్ టైలర్స్ మధార్, విజయా టైలర్స్ పసుపులేటి యానాదయ్య, బి.శ్రీనివాసులు, మురళీ, సుధాకర్, కె.ఖాధర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామన్నను గెలిపిద్దాం - వైఎస్ఆర్‌సిపి జెండా ఎగురవేద్దాం

**వింజమూరు ,ఫిబ్రవరి28ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలోని నాయకుల సమిష్టి కృషితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి పేర్నాటి శ్యామప్రసాద్‌రెడ్డిని గెలిపించి వైఎస్ఆర్‌సిపి జెండాను ఎగురవేద్దామని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌వివిఎస్ కన్వెన్షన్ కళ్యాణమండపంలో వింజమూరు, జలదంకి, కొండాపురం, కలిగిరి మండలాల్లోని వైసిపి నాయకులు , కార్యకర్తలు, పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సన్నిహితుడైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారన్నారు. ఈ ఎన్నికలను నియోజకవర్గంలోని వైఎస్ఆర్‌సిపి నాయకులు సమిష్టిగా కృషి చేసి నియోజకవర్గంలోని 9వేల పట్టభద్రుల ఓట్లను శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేయించి ఆయన గెలుపుకు సహక రించాలన్నారు. నియోజకవర్గంలోని నాయకులందరూ విభేదాలను పక్కనపెట్టి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ నమూనాలో 2వ సీరియల్ నెంబర్‌లో మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. ఈ ఎన్నికలకు 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు నాందిగా భావించి తన గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈప్రాంత అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, సర్పంచ్ ఎన్.సృజన, నాయకులు బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, ఎం.చిన్నికృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, అంకినపల్లి నర్సింహారెడ్డి, షేక్ నజీర్, కొండల రావ్, మద్దూరు బాలకృష్ణారెడ్డి, పల్లాపు పురుషోత్తం, ఆనంగి శ్రీనివాసులు, లెక్కల సుధాకర్‌రెడ్డి, సూరం వినోద్‌రెడ్డి , ఎన్.రాయుడు, భోజనపు గోపి, రొడ్డా కొండయ్య ,కలిగిరి మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, కొండాపురం మండల కన్వీనర్ రాజా, మొలకా మాల్యాద్రి, అక్కి భాస్కర్‌రెడ్డి, ఇతర మండలాల నాయకులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్ఆర్‌సిపి సోషల్‌మీడియా కన్వీనర్ శివారెడ్డి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## సిల్వర్‌ఓక్స్‌లో అకడమిక్ ఎక్స్‌పో -2023




**నెల్లూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక పార్థసారథి నగర్‌లోని సద్గురు సిల్వర్ ఓక్స్ పాఠశాల నందు అకడమిక్ ఎక్స్‌పో ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా పాఠశాల డైరెక్టర్స్ పి.షణ్ముగాచారి, వి.వెంకటాద్రి నాయుడులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిచారు. తమ విద్యాసంస్థలో విద్యార్థులను చదువుతోపాటూ అన్నీ రంగాల్లో ప్రోత్సహించటం జరుగు తుందన్నారు. క్రీడలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చదువు ఇలా అన్నింటిలో తమ విద్యార్థులు ఉత్తమంగా నిలువటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని, భవిష్యత్‌లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ నమూనా, నీటిని ఆదా చేసే నమూనా, పర్యావరనాన్ని రక్షించుకునే నమూనా, కష్టమైన మ్యాథ్స్‌ను సులభంగా చేసుకునే నమూనాలను ప్రదర్శనకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఉత్తమంగా నిలిచిన నమూనాకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్ సమస్యల్ని పరిష్కరిస్తూ అండగా వుంటా



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** టైలర్స్ సమస్యల్ని పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు చేపడతానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి అమరా ఎసి కళ్యాణమండపంలో మంగళవారం టైలర్స్‌డే 30వ వార్షికోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేదోడు పథకం ప్రవేశపెట్టి అందరిని ఆదుకున్నారన్నారు. జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు.
ఎవరైనా అర్హులకు ఈ పథకాల ఫలాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులందరికి ఇళ్ల మంజూరు చేస్తున్నామన్నారు. టైలర్స్ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి తొలుత పట్టణంలో టైలర్స్ ర్యాలీ నిర్వహించారు. కావలి టైలర్స్ అసోసియే షన్ గౌరవాధ్యక్షులు పి.పెంచలయ్య, గౌరవ సలహాదారులు ఎస్.కె.రఫి, అధ్యక్షులు యం.రమేష్, ఉపా ధ్యక్షులు వై.శ్రీహరి, పి.మాల్యాద్రి, ఎస్.డి.అల్తాఫ్, కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్, జాయింట్ కార్యదర్శులు ఆలా శ్రీనాథ్, ఎస్.కె.రసూల్, ట్రజరర్ పి.వేణు, వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, సామాజిక కార్యకర్త యం.మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, జనసేన సుధాకర్‌ని ఘనంగా సత్కరించారు.

## స్థానక సంస్థల యంఎల్‌సీ మేరిగను కలసిన సోషల్ మీడియా కన్వినర్‌లు

**రాపూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** స్థానిక సంస్థల శాసన మండలి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళీధర్‌ను మంగళవారం వెంకటగిరి నియోజకవర్గం కు చెందిన వైసిపి సోషల్ మీడియా కన్వినర్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.
ఈ సందర్భంగా వారుయంఎల్‌సీ మేరిగ మురళీధర్‌కు శాలువా కప్పి, పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్‌మాట్లాడుతూ సోషల్ మీడియా కన్వినర్‌లు చురుకుగా పనిచేసి సోషల్‌మీడియా వేదికగా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియచెప్పాలని కోరారు. మేరిగ మురళధర్‌ను కలసిన వారిలో రాపూరు మండల వైసిపిసోషల్ మీడియ కన్వినర్ మహేష్ రెడ్డి, కో కన్వినర్‌లు రేవూరు సాయికుమార్, గుమ్మా వెంకటేశ్వర్లు, సైదాపురం సోషల్ మీడియాకన్వినర్ చంద్రా చౌదరి తదితరులున్నారు.

## ఫ్యాన్‌కు ఉరివేసుకొని బైక్ మెకానిక్ హఫీజ్ ఆత్మహత్య



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కావలి పట్టణం ఇస్లాంపేటకు చెందిన బైక్ మెకానిక్ షేక్ హఫీజ్ (35) మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. అప్పులతో సతమతమవుతూ హఫీజ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లలకు స్కూలుకు భోజనం తీసుకెళ్లిన సమయంలో హఫీజ్ ఫ్యాన్‌కు చున్నీ కట్టుకొని ఉరివేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.